12042024-DIS-04_Layout 1 4/12/2024 2:19 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# బంగారం ధర పైపైకి..

*బంగారం అందమైన లోహమే కాదు, అధిక మారకపు విలువ కలిగి ఉంటుంది కూడా. మన దేశంలో మగ, ఆడ తేడా లేకుండా అందరూ బంగారాన్ని ఇష్టపడుతారు. ఎవరైనా నాలుగు రాళ్లు వెనకేసుకోగానే మొదటగా కొనాలనుకునేది బంగారాన్నే. డాబూ దర్పం ప్రదర్శించుకోవాలన్నా బంగారమే శరణ్యం. నగల కోసమే కాదు, పెట్టుబడుల కోసమూ బంగారాన్నే ఆశ్రయిస్తారు. బంగారం ధర అప్పుడప్పుడు ఆటుపోట్లకు గురైనప్పటికీ మొత్తం మీద స్థిరంగా పెరుగుతుండటమే అందుకు కారణం. పైగా ఎప్పుడు కావాలంటే అప్పుడు మార్కెట్లో అమ్మేసి నగదుగా మార్చుకోవడం సులభం. అయితే హిమాలయాల్లో మంచులాగా, సముద్రాల్లో నీరులాగా బంగారం అపరిమితంగా లేదు. గనుల్లోంచి కొండంత మట్టిని తవ్విపోసి శుద్ధి చేస్తే దొరికేది పిడికెడు బంగారమే. అందుకే బంగారానికి అంత డిమాండ్! తాజాగా ఈ డిమాండ్ ప్రతిరోజూ పతాక శీర్షికలకు ఎక్కుతున్నది.*

*గత వందేండ్లలో బంగారం ధర రూ.100 లోపు నుంచి రూ.70 వేల ఎగువకు చేరుకోవడం గమనార్హం. ఇలా సరికొత్త రికార్డు సృష్టించిన బంగారం ప్రస్తుతం రూ.72 వేల దగ్గర తచ్చాడుతున్నది. 2016తో పోలిస్తే ఇప్పుడు బంగారం ధర రెట్టింపు కావడం విశేషం. ప్రస్తుత గమనాన్ని గమనిస్తే.. రూ.లక్ష దిశగా పసిడి పరుగులు పెడుతున్నదనే విశ్లేషణలూ వినవస్తున్నాయి. మరి ఇటీవలి పొంగు ఎలా, ఎందుకు వచ్చిందని విశ్లేషిస్తే మనకు కొన్ని బాహ్య, అంతర్గత కారణాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే మూడు ప్రధాన కారణాలు దోహదం చేసి ఉంటాయని ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయం. అందులో మొదటిది చైనా సెంట్రల్ బ్యాంకు ఇబ్బడిముబ్బడిగా బంగారం నిల్వలు పెంచుకుంటుండటం. రెండోది అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెరుగుదల. మూడోది ద్రవ్యోల్బణం. డాలరు బలహీనమైపోతూ, స్టాక్‌మార్కెట్లు డీలా పడిపోవడంతో మదుపరులు బంగారం వైపు చూస్తున్నారు. యుద్ధాల వల్ల భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగి సరఫరా వ్యవస్థకు ఆటంకాలు ఏర్పడటం డిమాండ్ పెరుగుదలకు మరో కారణమని చెప్పవచ్చు.*

*బంగారానికి డిమాండ్ పెరగడానికి కొన్ని అంతరంగిక కారణాలూ ఉన్నాయి. భారతీయ కుటుంబ వ్యవస్థ ఇప్పటికీ బంగారం చుట్టే తిరుగుతున్నది. శుభకార్యాలకు బంగారం కొనడం అనే ఆనవాయితీ అనాదిగా వస్తున్నది. పెండ్లిళ్లు, పండుగల సీజన్ దృష్ట్యా మదుపరులే కాకుండా సాధారణ వినియోగదారులూ బంగారం కొంటుంటారు. ధన త్రయోదశి వంటి పండుగలు బంగారం కొనుగోలును ప్రోత్సహించడంలో ప్రముఖపాత్ర వహిస్తున్న సంగతి తెలిసిందే. కొన్నివర్గాల్లో దసరాకు బంగారం కొనడమనే ఆచారమూ ఉన్నది. అంతకంతకూ మధ్యతరగతి పెరుగుతుండటం వల్ల కొనేవారు పెరుగుతున్నారే తప్ప తగ్గడం లేదు. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని నగల వర్తకులు సీజనల్‌గా బంగారాన్ని నిల్వ చేయడం వల్ల కూడా ధరలు పెరిగి ఉండొచ్చని అంటున్నారు. బంగారం ధర విషయంలో మన దేశానికి, కొన్ని ఇతర దేశాలకూ చాలా అంతరం ఉంటుంది. అయితే విదేశాల నుంచి బంగారం తెచ్చుకోవాలంటే ఆంక్షలు, పన్నులు ఆటంకంగా ఉంటాయి. అందుకే అక్రమ తరలింపు అనేది ఒక జాడ్యంగా తయారైంది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల దగ్గర అంతకంతకూ ఎక్కువ బంగారం పట్టుబడటం మనం చూస్తున్నాం. ఈ ఆంక్షలను, పన్నులను తగ్గిస్తే బంగారం ధర కొంతమేర దిగివచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటే సామాన్యులకు కొంత ఉపశమనం కలుగుతుందని చెప్పొచ్చు.*

# అట్లుంటది 'హస్త' సాముద్రికం!



నాంచారయ్య మెరుగుమాల

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి గెలుస్తుందని, అధికారంలోకి రాబోతోందని, ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని కాబోతున్నారని తుక్కుగూడ జనజాతరలో తెలంగాణ సీఎం సహా కాంగ్రెస్ మంత్రులు చెప్పారు. ఈ మాటల్లో నిజమెంత ఉన్నదో.. బీఆర్ఎస్‌కు ఒకట్రెండు లోక్‌సభ సీట్లు కూడా రావని, ఎమ్మెల్యేల ఫిరాయింపుతో అసెంబ్లీలో దాని బలం గణనీయంగా పడిపోతోందనే వారి జోస్యంలోనూ అంతే నిజం ఉన్నది. పదేండ్ల తర్వాత అధికార పీఠమెక్కిన కాంగ్రెస్ నేతల అంచనాలు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నాలే గాని మరేమీ కావు. అయితే, తెలంగాణలోని కొందరు రాజకీయ పండితులు, పరిశీలకులు కూడా కాంగ్రెస్ బాణీలోనే లోక్‌సభ ఎన్నికల ఫలితాలను బేరీజు వేసి చెప్పడం వింతగా ఉన్నది.

ఏ రాష్ట్రంలోనైనా ఆరు నెలల వ్యవధిలో రెండు చట్టసభలకు (అసెంబ్లీ, పార్లమెంట్) వెంటవెంటనే ఎన్నికలు జరిగితే ఫలితాలు ఒకే తీరున ఉండే అవకాశం ఉంటుంది. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సాధారణ నమ్మకం. ఈ సూత్రీకరణకు భిన్నమైన ఫలితాలు వచ్చిన సందర్భాలు అనేకం కనపడుతాయి. పైన చెప్పిన కొందరు దేశవాళీ ఎన్నికల విశ్లేషకుల అంచనాల ప్రకారం.. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలోని మొత్తం 17 స్థానాలకు గానూ బీఆర్ఎస్‌కు అతి తక్కువ సీట్లు వస్తాయనడానికి ఈ 4 నెలల్లో జరిగిన గొప్ప రాజకీయ పరిణామాలేవీ లేవు. అత్యధిక హామీలను తొలి వంద రోజుల్లో కాంగ్రెస్ అమలు చేయనూ లేదు. శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన కీలక వాగ్దానాలను అమలు చేయడానికి గట్టి ప్రయత్నాలు ఇంకా మొదలుపెట్టలేదు. జాతీయపక్షాలకు అత్యధిక రాష్ట్రాల్లో అసెంబ్లీలో కన్నా పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు దక్కిన మాట చాలా సందర్భాల్లో వాస్తవమే గానీ ప్రతి సందర్భంలోనూ అదే జరగాలని లేదు. ఏదైనా ఒక రాష్ట్రంలో ఏకకాలంలో అసెంబ్లీ, పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో కాస్త భిన్నమైన ఫలితాలు వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జీవించి ఉండగా 1989 చివరలో 9వ లోక్‌సభతో పాటు జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలకుగాను టీడీపీ 74 సీట్లు గెలిచింది. 42 పార్లమెంట్ సీట్లలో కేవలం రెండే రెండు స్థానాలను (బొబ్బిలి, నర్సాపురం) దక్కించుకున్నది. ఏడాదిన్నరకే 1991 మేలో జరిగిన పార్లమెంట్ మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ 13 సీట్లతో బలం పెంచుకోగా, పాలకపక్షమైన కాంగ్రెస్ బలం 14 సీట్లు తగ్గి 25కు పడిపోయింది. అలాగే 1980 లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో తమిళనాడులో దివంగత సీఎం ఎంజీఆర్ నాయకత్వంలోని ఏఐఏడీఎంకే మొత్తం 39 సీట్లలో 2 మాత్రమే గెలుచుకొని చతికిలపడింది. అయితే, ఆరు నెలల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతీయ పక్షం మొత్తం 234 సీట్లలో 162 కైవసం చేసుకొని మరోసారి అధికారంలోకి వచ్చింది.

**పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోయి, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఎల్‌డీఎఫ్:** కొన్ని రాష్ట్రాల్లో జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను గమనిస్తే.. ఇలాంటి భిన్నమైన ఫలితాలు వచ్చాయనే విషయం అవగతం అవుతుంది. 2019 పార్లమెంటు ఎన్నికల్లో కేరళలో సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ కూటమికి మొత్తం 20 స్థానాల్లో ఒకే ఒక సీటు రాగా, కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ మిగిలిన 19 స్థానాలను కైవసం చేసుకున్నది. కానీ, రెండేండ్ల తర్వాత 2021 మేలో జరిగిన కేరళ శాసనసభ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ మొత్తం 140 సీట్లలో 99 గెలుచుకొని చరిత్రాత్మక విజయం



సాధించింది. పాలక కూటమి బలం 9 సీట్లు పెరిగింది. కాంగ్రెస్ కూటమి బలం 6 స్థానాలు తగ్గి 41కి పడిపోయింది. ఓట్ల శాతం విషయానికి వస్తే.. ఎల్‌డీఎఫ్‌కు 45.43 శాతం, కాంగ్రెస్ కూటమికి 39.47 శాతం లభించాయి. 2018 చివరలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోగా, కాంగ్రెస్ విజయం సాధించింది.

> ఆరు నెలల తర్వాత జరిగిన 2019 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఈ మూడు రాష్ట్రాల్లోని 90 శాతానికి పైగా సీట్లను కైవసం చేసుకొని సంచలనం సృష్టించింది. ఇంకా మూడు దశాబ్దాల కిందట ఉమ్మడి ఏపీలో 1994 డిసెంబర్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ మొత్తం సీట్లలో మూడొంతులకు పైగా స్థానాలను కైవసం చేసుకున్నది. ఆ తర్వాత ఏడాదిన్నరలోపే అనగా 1996 మార్చిలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మొత్తం 42 సీట్లకుగాను పాలకపక్షమైన టీడీపీ కేవలం 16 సీట్లు గెలుచుకున్నది. అంతకుముందు అసెంబ్లీ ఎన్నికల్లో 25 స్థానాలే దక్కించుకున్న కాంగ్రెస్ 22 ఎంపీ సీట్లు కైవసం చేసుకున్నది. ఇలా చెప్పుకుంటూపోతే పార్లమెంటుకు, అసెంబ్లీకి కొన్ని మాసాలు లేదా సంవత్సరాల వ్యవధితో జరిగే ఎన్నికల్లో భిన్నమైన ఫలితాలు రావడం భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కనిపించే సాధారణ వ్యవహారం.

**ఆధిక్యం రెండు శాతమే:** 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి పాలకపక్షం బీఆర్ఎస్‌పై కేవలం 2.05 శాతం ఓట్ల ఆధిక్యంతో (39.40 శాతం) కాంగ్రెస్ పార్టీకి సాధారణ మెజారిటీకి అవసరమైన 64 సీట్లు దక్కాయి. బీఆర్ఎస్‌కు 39 సీట్లు వచ్చాయి. మరో రకంగా చెప్పాలంటే తెలంగాణ అసెంబ్లీలోని మొత్తం 119 సీట్లలో కాంగ్రెస్‌కు 53 శాతం రాగా, బీఆర్ఎస్‌కు 32 శాతం వచ్చాయి.

> దాదాపు 40 శాతానికి దగ్గరగా ఓట్లు, మూడో వంతు సీట్లు దక్కించుకున్న నేపథ్యంలో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చిక్కే సీట్లు ఒకటా? రెండా? అనే కొందరు కాంగ్రెస్ భజనపరులు వేస్తున్న అంచనాలు హేతుబద్ధంగా లేవు. ఇక బీజేపీ విషయానికి వస్తే.. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో ఒక మోస్తరు త్రిముఖ పోటీ జరగడంతో 13.9 శాతం ఓట్లతో ఆ పార్టీ 8 స్థానాలు కైవసం చేసుకున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోటీ కారణంగా ఈ రెండింటిలో ఏ ఒక్క పక్షానికి 45 శాతం ఓట్లు రాకపోవడంతో మధ్యలో బీజేపీకి మొత్తం సీట్లలో 6.7 శాతం లభించాయి.

గత నాలుగు దశాబ్దాల నుంచి లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ పక్షాల వైపు తెలుగు ఓటర్లు కాస్త మొగ్గు చూపించడం వల్ల బీజేపీ గత నాలుగైదు అసెంబ్లీ ఎన్నికల్లో పది సీట్లలోపే దక్కించుకున్నది. కానీ, 1998 నుంచి (2004, 2009 ఎన్నికలు దీనికి మినహాయింపు) జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 3, 4 సీట్లు కైవసం చేసుకున్నది. తెలంగాణ ఇచ్చానని చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీని జనం నమ్మడానికి పదేండ్లు పట్టింది. మరి తెలంగాణ సాధనకు 2002 నుంచి 2014 వరకూ నిరవధిక పోరు సలిపి అధికారంలోకి వచ్చింది టీఆర్ఎస్. తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షను కార్యరూపంలో సాధించి తొమ్మిదిన్నరేండ్లు పాలకపక్షంగా కొనసాగిన చరిత్ర బీఆర్ఎస్‌ది. పై అంశాలన్నీ పరిశీలిస్తే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుచుకునే సీట్లపై ఎన్నికల విశ్లేషకుల అంచనాలకు అర్థం లేదు. అలాగే 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క కేరళలోనే రెండంకెల సీట్లు గెలుచుకున్నది కాంగ్రెస్. మొత్తం 52 సీట్లకే పరిమితమైంది. గుర్తింపు పొందిన ప్రతిపక్షానికి అవసరమైన సీట్లు పార్లమెంటు దిగువ సభలో కాంగ్రెస్ పార్టీకి పదేండ్లుగా లేవు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సర్కారు ప్రవేశపెట్టిన రైతుబంధు వంటి సంక్షేమ పథకాలను అమలు చేయలేక చతికిలపడుతున్న హస్తం పార్టీ ప్రభుత్వం ఈ మధ్యకాలంలో ఏం చేసిందని జనం 14 సీట్లు ఇస్తారో ఆ పార్టీ అయినా చెప్పే స్థితిలో లేదు. బొటాబొటి మెజారిటీతో నాలుగు నెలల కిందట అధికారం దక్కిన తెలంగాణలో 14 ఎంపీ సీట్లలో విజయం సాధిస్తే పార్టీ అధినేత రాహుల్ ప్రధాని అవుతారన్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటన ఈ ఏడాదికి పెద్ద జోక్‌గా మిగిలిపోతుంది.

## కాంగ్రెస్‌దీ అదే ఆలోచనా ధోరణి!

బీజేపీ, సంఘ్ పరివార్‌ల ఆలోచనాధోరణే కాంగ్రెస్‌కు ఉన్నది. ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకొని బీజేపీ సర్కార్ తీసుకొచ్చిన సీఏఏను అమెరికా సహా అనేక దేశాలు విమర్శించాయి. కానీ, కాంగ్రెస్ మాత్రం సంఘ్ పరివార్ ఎజెండాను అమలు చేస్తున్న బీజేపీని వ్యతిరేకించడం లేదు. ఆ విషయంలో కనీసం ఒక వైఖరి కూడా తీసుకోవడం లేదు.

**- పినరాయి విజయన్,**
*కేరళ ముఖ్యమంత్రి*

**లేఖ**

## అటకెక్కిన పాలన

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి నాలుగు నెలలు దాటింది. అయినా పాలన మాత్రం గాడిన పడలేదు. 'ఎక్కడి గొంగడి అక్కడే' అనే చందాన రాష్ట్రంలో సమస్యలన్నీ ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. నిరుద్యోగ యువతకు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి.. గత ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాల నియామక పత్రాలు అందజేసి చేతులు దులుపుకొన్నారు. కొత్త ఉద్యోగాల ఊసే ఎత్తలేదు. అంతేకాకుండా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో తమ మార్కు పాలన చూపిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊదరగొట్టినప్పటికీ నాటి మాటలకు, నేటి చేతలకు ఎక్కడా పొంతన లేదని ప్రజలు వాపోతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పార్లమెంటు ఎన్నికలపై ఉన్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై లేదనే విషయం స్పష్టమవుతున్నది. సీఎం రేవంత్ ఇకనైనా ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలి. లేకుంటే ఆయనకు ప్రజలే సరైనరీతిలో బుద్ధి చెప్తారు.

**- పూసాల వేణుగోపాల్**

# చట్టసభల్లో ఎస్సీ ఉప కులాలకు స్థానమేదీ?

రాజ్యాధికారం దక్కని కులాలు అంతరించిపోతాయని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ చెప్పిన మాటలు అక్షర సత్యం. అట్టడుగువర్గాల ప్రజలందరికీ రాజ్యాధికారం దక్కాలనే ఉద్దేశంతో దేశ పౌరులకు ఓటు హక్కు కల్పించారు. రాజ్యాంగ రక్షణతో పాటు రాజకీయ రిజర్వేషన్లు కల్పించారు. విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయంగా, సామాజికంగా అత్యంత వెనుకబడిన కులాలకు చెందినవారు అభ్యున్నతి సాధించాలని, సమాజంలో సమాన స్థాయికి చేరాలని భారత రాజ్యాంగం దళితులకు రిజర్వేషన్లు కల్పించింది. కానీ, దళిత సమాజంలోని కొన్ని వర్గాలు నేటికీ అసమానతలను ఎదుర్కొంటున్నాయనేది వాస్తవం. రిజర్వేషన్ ఫలాలు కింది స్థాయి వరకు చేరడం లేదనేది కఠోర సత్యం. రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో షెడ్యూల్డ్ కులానికే చెందిన మాల, మాదిగ వర్గాలు అత్యధికంగా లబ్ధి పొంది, మిగతా కులాలు అణచివేతకు గురయ్యాయని అనేక నివేదికలు తేటతెల్లం చేశాయి. నివేదికల వరకు ఎందుకు? మన కండ్ల ముందే వాస్తవ పరిస్థితి కనిపిస్తున్నది.



బైరి వెంకటేశం మోచి
94919 94090



ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలోని 3 ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో అభ్యర్థిత్వం కోసం మాల, మాదిగ కులాలే పోటీ పడుతుండటం గమనార్హం. ఇంతకాలం అన్యాయానికి గురై, రాజ్యాధికారానికి పూర్తిగా దూరమైన ఉపకులాలను విస్మరిస్తూ.. 'మాకు అన్యాయం జరిగింది, కాదు కాదు మాకు అన్యాయం జరిగింది. మాకే మొత్తం ఎస్సీ రిజర్వ్‌డ్ పార్లమెంట్ స్థానాలను కేటాయించాలి' అని మాల, మాదిగ వర్గాలు పోరాడుతుండటాన్ని చూస్తే విస్మయం కలుగక మానదు. రాజ్యాధికారాన్ని అనుభవిస్తున్నవారే బహుజన రాజ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్నామని చెప్పడం విడ్డూరం.

2011 జనాభా లెక్కల ప్రకారం.. తెలంగాణ జనాభా 3.63 కోట్లు. ఇందులో షెడ్యూల్డ్ కులాల జనాభా 63,60,158. అంటే రాష్ట్ర జనాభాలో 17.50 శాతం ఎస్సీలే. దళిత జనాభాలో మాదిగల సంఖ్య 25,09,992. అంటే దళితుల్లో 39 శాతం. ఇది రాష్ట్ర జనాభాలో 6.9 శాతం. మాలల జనాభా 17,05,448. అంటే దళితుల్లో 27 శాతం, రాష్ట్ర జనాభాలో 4.6 శాతం. ఇక దళితుల్లో అత్యంత వెనుకబడిన కులాల (ఉప కులాలు) జనాభా 21,44,718. అంటే దళిత జనాభాలో 34 శాతం. రాష్ట్ర జనాభాలో 5.9 శాతం వారే ఉన్నట్టు లెక్క.

మరొక అన్యాయం ఏమంటే.. మాల, మాదిగలకు కుల ధ్రువీకరణ పత్రాలు తహశీల్దార్ ఇస్తే, ఉపకులాలకు మాత్రం ఆర్డీవో జారీ చేస్తారు. ఈ నిబంధన వల్ల ఉపకులాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ కారణంగానే లక్షలాది మంది ఉపకులాలవారు మాల, మాదిగ కుల ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారు. దీంతో ఈ రెండు కులాల జనాభా అధికారిక లెక్కల్లో పెరిగింది. వాస్తవానికి ఉపకులాల జనాభా మాల, మాదిగల కంటే ఎక్కువగా ఉంటుంది. అందుకే ఎస్సీ కులగణన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఇక రాజకీయ అవకాశాల విషయానికొస్తే.. ఉమ్మడి ఏపీలో 42 పార్లమెంట్ స్థానాలుండగా వాటిలో ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు 7. అదే విధంగా 294 అసెంబ్లీ స్థానాల్లో ఎస్సీలకు కేటాయించినవి 48. 1956 నుంచి 2014 వరకు చూసుకుంటే.. ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో అధిక శాతం మాలలకు దక్కగా, ఆ తర్వాత స్థానంలో మాదిగలు ఉన్నారు. నాడు ఉపకులాల ఊసేలేదు. రాష్ట్ర విభజన తర్వాత మన తెలంగాణలో ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 19 ఎస్సీ రిజర్వ్‌డ్ కాగా, 17 పార్లమెంట్ స్థానాల్లో 3 ఎస్సీ రిజర్వ్‌డ్. ఈ 3 స్థానాల విషయానికొస్తే.. దశాబ్దాలుగా పెద్దపల్లి నియోజకవర్గంలో మాల సామాజికవర్గానికి చెందిన గుడిసెల వెంకటస్వామి కుటుంబం, నాగర్‌కర్నూల్ నుంచి మాదిగ సామాజికవర్గానికి చెందిన మంద జగన్నాథం, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి మాదిగ సామాజికవర్గానికి చెందిన నంది ఎల్లయ్య ప్రాతినిధ్యం వహించారు. నియోజకవర్గాల పునర్విభజనలో కంటోన్మెంట్ స్థానం కనుమరుగైంది. దాని స్థానంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడింది. అయితే అక్కడి నుంచి కూడా మాదిగలే ప్రాతినిధ్యం వహించారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్సీ ఉపకులాలు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నాయి. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో.. ఉపకులాల సంఖ్య అధికంగా ఉన్న పెద్దపల్లి నియోజకవర్గంలో మొదటిసారి నేతకాని ఉపకులానికి చెందిన బోర్లకుంట వెంకటేష్ నేతకు పార్లమెంట్ సభ్యునిగా అవకాశం లభించింది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ 3 ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో సామాజిక న్యాయ ప్రకారం.. ఒక స్థానం మాదిగలకు, రెండోది మాలలకు, మూడోది ఉపకులాలకు దక్కాలి. కానీ మాల, మాదిగ కులాలకు చెందినవారే.. తమకు అన్యాయం జరిగిందంటే, తమకు అన్యాయం జరిగిందని వాదులాడుకుంటూ ఉపకులాల గొంతు నొక్కుతున్నారు.

తెలంగాణలోని 19 ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో 10 చోట్ల మాదిగలు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. మిగతా 9 స్థానాల్లో మాలలు అధికారాన్ని అనుభవిస్తున్నారు. సామాజిక న్యాయం, జనాభా దామాషా ప్రకారం.. వెనుకబడిన దళిత ఉపకులాలకు 6 స్థానాలు దక్కాల్సి ఉండగా ఎక్కడా అవకాశమివ్వడం లేదు. మాలల వల్ల మాదిగలకు అన్యాయం జరుగుతున్నదని, మిగతా వెనుకబడిన దళిత కులాలకు న్యాయం చేకూర్చేలా ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ 'మాదిగ దండోర' పేరుతో ఒక వర్గం.. ఎస్సీలను వర్గీకరించవద్దని 'మాల మహానాడు' పేరిట మరో వర్గం ఉద్యమిస్తున్నది. ఈ రెండు కులాల నేతలు ఈ విధంగా రాజ్యాధికారం అనుభవిస్తూ, ఆధిపత్యం చెలాయిస్తూ మిగతా 57 ఉపకులాలను ఎదగనివ్వకుండా అణచివేస్తున్నారు.

దళితులందరికీ దక్కాల్సిన ప్రయోజనాలను ఈ రెండు కులాలే పొందుతున్నాయి. సర్పంచి నుంచి మొదలుకొని రాష్ట్ర మంత్రుల వరకు ఈ కులాలే వారే ఎక్కువగా ఉంటున్నారు. దళితుల్లో వెనుకబాటుకు గురైన కులాల పేర్లు బయటికి రానీయకుండా, వారి సమస్యలు పరిష్కరించకుండా మాదిగ ఉపకులాలు, మాల ఉపకులాలనే ముద్ర వేసి అందరి ప్రయోజనాలు రెండు వర్గాలే పొందుతుండటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

> ఉపకులాలకు కనీసం నామినేటెడ్ పదవులు కూడా దక్కడం లేదు. ఉమ్మడి ఎస్సీ కార్పొరేషన్‌లో, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో ఉపకులాలకు కనీసం సభ్యులుగా కూడా స్థానం లేకపోవడం శోచనీయం. వారికి నామినేటెడ్ ఎమ్మెల్సీ, ఎంపీ (రాజ్యసభ) స్థానాలు కూడా దక్కడం లేదు. ప్రభుత్వ పథకాల లబ్ధిలోనూ ఒక్క శాతం అందడం లేదు. ఉపకులాలు కేవలం ఓటు బ్యాంకుగానే మిగిలిపోయాయి. దళితుల్లోనే ఇంతటి వివక్ష, ఆధిపత్యం ఉంటే ఇక రిజర్వేషన్లు ఎందుకున్నట్టు? ఎవరి కోసం ఉన్నట్టు?

ఇప్పటికైనా ప్రభుత్వాలు తమ ఆలోచనాధోరణిని మార్చుకోవాలి. ఈ వివక్షను రూపుమాపాలి. వెనుకబడిన దళిత కులాల వృత్తులు, సంప్రదాయాలను పరిరక్షించడం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలి. ఈ కులాలను ఉపకులాలుగా కాకుండా మోస్ట్ బ్యాక్‌వర్డ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎంబీఎస్‌సీ)గా గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి. నామినేటెడ్ ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాలను ఇవ్వాలి. ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాల, మాదిగలతో సంబంధం లేకుండా ఉపకులాలను 'ఏ' వర్గంలో చేర్చి శాశ్వత న్యాయం చేయాలి. జనాభా దామాషా ప్రకారం ప్రత్యేక రిజర్వేషన్లను అమలు చేస్తేనే ఉపకులాలకు చెందిన ప్రజల జీవితాలు బాగుపడుతాయి.

రాష్ట్రంలో దళిత జనాభా 17 నుంచి 25 శాతానికి పెరిగిందనేది ఒక అంచనా. దీని ప్రకారం మాదిగల జనాభా 6 నుంచి 9 శాతానికి, మాలల జనాభా 4 నుంచి 6 శాతానికి, మిగతా 57 ఉపకులాల జనాభా 6 నుంచి 10 శాతానికి పెరిగిందన్నది వాస్తవం. కానీ, మాదిగలే 12 శాతానికి పైగా ఉన్నారని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రభుత్వాన్ని, సమాజాన్ని కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా దళితుల రిజర్వేషన్లను పెంచాలి. జనాభా దామాషా ప్రకారం.. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలతో పాటు నామినేటెడ్ పదవుల్లో మాల, మాదిగ, ఉపకులాలకు సమాన అవకాశాలు కల్పించాలి. ఇప్పటి వరకు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశమే లభించని ఉపకులాలకు పోటీ చేసే అవకాశం కల్పించాలి. ఇప్పటివరకు రాజ్యాధికారాన్ని అనుభవించిన కులాలు జనరల్ స్థానాల్లో పోటీ చేస్తేనే అంబేద్కర్ ఆశించిన సామాజిక న్యాయం జరుగుతుంది.

**(వ్యాసకర్త: ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు)**

# విద్వేషపూరిత ప్రసంగాలకు చెక్!

దేశంలోనే అతి పెద్దదైన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఈటల రాజేందర్‌ను బీజేపీ బరిలోకి దింపింది. వామపక్ష భావజాలంతో విద్యార్థి ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన ఆయన... టీఆర్ఎస్ పార్టీ వేదికగా రాజకీయ అరంగేట్రం చేసిన విషయం విదితమే. కమలాపూర్, హుజూరాబాద్ నుంచి ఆయన పలుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తదనంతర రాజకీయ పరిణామాలతో బీజేపీలో చేరారు. వామపక్ష భావజాలంతో పాటు రెండు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉన్న ఈటల రాజేందర్ మల్కాజిగిరిలో చేస్తున్న ప్రసంగాలను చూసి రాజకీయ నాయకులే కాదు, ఆయన సన్నిహితులు సైతం నోరెళ్లబెడుతున్నారు.



ఫిరోజ్ ఖాన్
96404 66464

తెలంగాణపై పూర్తి పట్టు, రాజకీయ అంశాలపై సమగ్ర అవగాహన, అన్ని పార్టీల్లోని లోటుపాట్లు తెలిసిన ఈటల తన విజయభారాన్ని మోదీపైనే వేసినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. అతనే కాదు, సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డి, నిజామాబాద్ అభ్యర్థి ధర్మపురి అరవింద్, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్, మెదక్ నుంచి బరిలో ఉన్న రఘునందన్‌రావు, మహబూబ్‌నగర్ అభ్యర్థి డీకే అరుణ కూడా మోదీపైనే ఆధారపడుతున్నారని తెలుస్తున్నది. వారి ప్రసంగాలను వింటే ఆ విషయం అర్థమవుతున్నది. స్థానిక సమస్యలను అసలు ప్రస్తావించకుండా, అభివృద్ధి గురించి చర్చించకుండా.. 'జమ్ముకశ్మీర్, బాంబు పేలుళ్లు, మందిర్-మసీదు, హిందూ-ముస్లిం' తదితర అంశాల చుట్టే వారి ప్రసంగాలు సాగుతుండటం అందుకు నిదర్శనం.

దక్షిణాదిలో ఏ నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలో బీజేపీ అభ్యర్థులకు తెలియడం లేదు. బీసీ, ఎస్సీ నినాదాలను ఎత్తుకున్నా వర్కవుట్ కాకపోవడంతో బీజేపీ నేతలంతా రొడ్డకొట్టుడు విమర్శలు, మోదీ పేరునే జపిస్తున్నారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చిన నాటినుంచి బాంబు పేలుళ్లు లేవని, రామమందిరం నిర్మించారని, ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని మోదీ ఆపారంటూ చెప్పిన మాటలే మళ్లీమళ్లీ చెప్తూ ప్రజల మెదళ్లలో చొప్పించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ పదేండ్లలో 'మేం ఇది చేశాం' అని చెప్పుకోవడానికి ఏమీ లేకపోవడంతో ఏం చేయాలో తోచక, ఏ అంశాన్ని ప్రచారం చేయాలో తెలియక బీజేపీ అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. అందుకే రెండు దశాబ్దాలుగా ఉత్తర భారత్‌లోని రాష్ట్రాల్లో అనుసరిస్తున్న వ్యూహాన్నే దక్షిణాదిలోనూ కమలం పార్టీ ప్రయోగిస్తున్నది.

దేశంలో ద్వేషపూరిత ప్రసంగాలు పెరుగుతున్నాయని 'ఇండియా హేట్ ల్యాబ్' ఇటీవల స్పష్టం చేసింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే 75 శాతం విద్వేషపూరిత ప్రసంగాల ఘటనలు నమోదయ్యాయని ఆ నివేదిక తెలిపింది. బీజేపీ నాయకులతో పాటు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ వంటి సంస్థల నేతలు ఈ ప్రసంగాలు చేస్తున్నట్టు పేర్కొన్నది. 2023లో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని పలువురు నేతలు 668 ద్వేషపూరిత ప్రసంగాలు చేయగా.. వాటిలో 498 ప్రసంగాలు బీజేపీ పాలిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోనే కావడం గమనార్హం. వాటిలో 239 ప్రసంగాలు ముస్లింలపై ప్రత్యక్ష హింసాకాండను ప్రేరేపించేవిగా ఉన్నాయి. 420 ప్రసంగాలు లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, హలాల్ జిహాద్, పాపులేషన్ జిహాద్‌లకు సంబంధించినవి. 169 ఘటనలు ముస్లిం ప్రార్థన స్థలాలను లక్ష్యంగా చేసుకున్నవి. ముఖ్యంగా ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల సమయంలోనే ఎక్కువగా విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. అత్యంత విద్వేష ప్రసంగాలు చేసిన 8 మంది నేతల్లో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా ఉన్నారు.



తెలంగాణలో బీజేపీకి చెందిన ఆరుగురు కీలక నేతలు ఈసారి పార్లమెంట్ బరిలో ఉన్నారు. ఆ నేతలు ఆయా నియోజకవర్గాల్లో ర్యాలీలతో పాటు టిఫిన్ బైఠక్, చాయ్ పే చర్చ, మార్నింగ్ వాక్, అల్పాహార విందు వంటి కార్యక్రమాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే వారందరి ప్రసంగాలు ఒకే రీతిలో సాగుతున్నాయి. ఒకరినొకరు కాపీ కొట్టినట్టే వారి ప్రసంగాలు సాగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. '370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్, మేక్ ఇన్ ఇండియా'.. తదితర అంశాలే అందరి ప్రసంగాల్లోనూ ప్రధానాస్త్రాలుగా కనిపిస్తున్నాయి. ఢిల్లీ హై కమాండ్ నుంచి వచ్చిన స్క్రిప్ట్‌నే వారంతా చదువుతున్నట్టు స్పష్టంగా అర్థమవుతున్నది. ఆ ప్రసంగాల ద్వారా వారు ఆశిస్తున్నదేమిటో విజ్ఞులైన తెలంగాణ ప్రజలు ఎప్పుడో పసిగట్టారు. అందుకే వారి విద్వేషపూరిత ప్రసంగాలను తిరస్కరిస్తున్నారు. వారిని, వారి ప్రసంగాలను ప్రజలు తిరస్కరించారనడానికి రాబోయే పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే నిదర్శనంగా నిలువనున్నాయి.